సింహవాహనంపై శ్రీనివాసుడు



జూబ్లీహిల్స్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో సింహవాహనంపై ఊరేగింపు, భక్తుల కోలాటాలు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 28: జూబ్లీహిల్స్‌లోని టీటీడీ వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం శ్రీనివాసుడు శ్రీయోగ నరసింహ స్వామి అలంకరణలో సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి ఊరేగింపులో భక్తుల సందడి అంబరాన్నంటింది. కోలాటాలు, చెక్కభజనలు, మంగళవాయిద్యాలతో ఆలయంలో ఉత్సాహం వెల్లివిరిసింది. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం సింహ వాహనంపై స్వామివారు అధిరోహించారని వేద పండితులు తెలిపారు. సాయంత్రం స్వామివారిని ముత్యపు పందిరి వాహనంపై మాఢవీధుల్లో ఊరేగించారు.

ప్రతిభకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం

సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులతో కలెక్టర్ అనుదీప్

సిటీ బ్యూరో, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): చిన్నప్పటి నుంచే వైజ్ఞానిక ప్రదర్శనల్లో పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో సైన్స్‌లో ప్రతిభ సాధిస్తారని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూషన్స్, డిజేబుల్డ్ చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూషన్స్ లో ని 6 నుంచి 18 ఏండ్ల పిల్లలతో ఓల్డ్ బోయిన్ పల్లిలోని తార హోమ్ లో ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్ ఎగ్జిబిషన్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సైన్స్ తోనే ప్రతిఒక్కటీ ముడిపడి ఉందని అన్నారు. విజ్ఞాన ప్రదర్శనలో ఉన్న జిల్లాలోని 57 చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూషన్స్, 07 డిజేబుల్డ్ చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూషన్స్ లోని 800 చిన్నారులు పాల్గొనడం అభినందనీయమని అన్నారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన వివిధ ప్రాజెక్టులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి అబ్దుల్ జావిద్, ఫ్రెండ్లీ ఎన్విరాన్మెంట్ ఫర్ ది డిసేబుల్డ్ చైర్మన్ గంగారం, సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ శైలజ, ఎస్సీపీసీఆర్ మెంబర్ బృందాధర్, అపర్ణ, రాగజ్యోతి, తార హోం ఫాదర్ జోస్ మాథ్యూ డబ్ల్యూవో అక్కేశ్వరరావు, నబి, లలిత, ప్రమోద్, జిల్లా సైన్స్ ఆఫీసర్ ధర్మేందర్‌రావు, జ్యూరీ సభ్యులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యం అంటే ఇదేనా!

సీఎంకు చిత్తశుద్ధి ఉంటే అసైన్డ్ భూములపై పేదలకే హక్కు కల్పించాలి

సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్

ఖైరతాబాద్, ఫిబ్రవరి 28: భూస్వాములు, పెత్తందారుల భూముల రక్షణ కోసమే ముఖ్యమంత్రి పనిచేస్తున్నారని, ఇందిరమ్మ రాజ్యం అంటే ఇదేనా అని ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ ప్రశ్నించారు. తెలంగాణ అసైన్డ్ ల్యాండ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్లోక్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ప్రభుత్వ తీరుపై ధ్వజమెత్తారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే సుమారు 24 లక్షల ఎకరాల అసైన్డ్ భూములను 16లక్షల మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారన్నారు. కానీ ప్రస్తుతం ఆ భూములన్నీ పేదల చేతిలో నుంచి పెద్దల చేతుల్లోకి వెళ్తున్నాయని, అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటే భూస్వాములు, ధనవంతుల భూములను రక్షించడం కాదన్నారు. ముఖ్యమంత్రి కేవలం తన సామాజికవర్గం కోసమే పాటుపడుతున్నారని, కోటి మంది దళితులు ఓట్లు వేస్తే అధికారంలోకి వచ్చాని గుర్తించాలని హితవుపలికారు. తక్షణమే అసైన్డ్ భూముల లెక్కలు తేల్చి, 1977 పీవోటీ చట్టాన్ని రద్దు చేసి, ఆ భూములు కలిగి ఉన్న పేదలకే వాటిపై సర్వహక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో త్వరలోనే ఇందిరా పార్కు వద్ద లక్షలాది మంది లబ్ధిదారులతో 24గంటల ఆమరణ దీక్ష చేపడుతానని హెచ్చరించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రోళ్ల శివయ్య, ఉపాధ్యక్షులు రుద్రారం శంకర్, బింగి రాములు, అంథోని, రాష్ట్ర నాయకులు ఘంటా మల్లేశం, ఎస్.నాను, దాసారాంబస్తీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువత భవిష్యత్తు మెరుగుపరిచే దిశగా చర్యలు



సిటీబ్యూరో, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ):హైదరాబాద్ యువత భవిష్యత్తును మెరుగుపరిచే దిశగా జీహెచ్ఎంసీ చర్యలు చేపట్టిందని, అందులో భాగమే లైట్‌హౌజ్ కేంద్రాలతో యువతకు నైపుణ్యాన్ని పెంపొందించి, ఉద్యోగ అవకాశాలు అందించడమే లక్ష్యమని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పేర్కొన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు, స్వయం ఉపాధి అభివృద్ధి చేసుకునేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. మొజంపురా బజార్‌ఘాట్‌లో ఏర్పాటు చేసిన మల్లేపల్లి లైట్‌హౌస్ సెంటర్‌ను శుక్రవారం మేయర్, డిప్యూటీ మేయర్ శ్రీలతతో కలిసి ప్రారంభించారు. జీహెచ్ఎంసీ, లైట్ హౌస్ కమ్యూనిటీస్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో యువతకు నైపుణ్యం, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, కార్పొరేటర్ జాఫర్ ఖాన్, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

హస్త కళాకారులను ప్రోత్సహిస్తాం

కవాడిగూడ, ఫిబ్రవరి 28: చేతి వృత్తి కళాకారుల నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం నెలకొల్పుతున్న స్కిల్ యూనివర్సిటీలో కళాకారులకు ఒక సెగ్మెంట్ ఏర్పాటు చేసి ప్రోత్సహిస్తామని తెలంగాణ రాష్ట్ర చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. తెలంగాణ హస్తకళల అభివృద్ధి సంస్థ, నాబార్డ్ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని తెలంగాణ కళాభారతిలో ఏర్పాటు చేసిన క్రాఫ్ట్స్ టెక్స్ స్టైల్స్ మేళాను తెలంగాణ హస్తకళా అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శైలజారామయ్యర్, నాబార్డ్ సీజీఎం ఉదయభాస్కర్‌తో కలిసి మంత్రి శుక్రవారం ప్రారంభించారు. కళాకారులు ఏర్పాటు చేసిన వర్క్ షాప్ ను, ప్రదర్శనలోని స్టాల్స్ ను మంత్రి పరిశీలించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పదకొండు మంది మాస్టర్ కళాకారులను మంత్రి శాలువాలతో సన్మానించి నగదు పురస్కారాలను అందజేసి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ప్రత్యేక నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్న మాస్టర్ కళాకారులను రాష్ట్ర అవార్డులతో ఘనంగా సన్మానిస్తున్నామని, మొదటి బహుమతిగా 50 వేలు, రెండో బహుమతిగా 40 వేలు, మూడో బహుమతిగా 35 వేలు, మిగతా ఎనిమిది మందికి 20 వేల నగదు పురస్కారం, సర్టిఫికెట్ అందజేసి ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఓఎస్డీ భాష, హస్తకళాభివృద్ధి సంస్థ అధికారులు మక్సూద్, శ్రీఫణి, సిబ్బంది పాల్గొన్నారు.

చేపలను హింసించకండి

కేబీఆర్ పార్కువద్ద పెటా ఆధ్వర్యంలో వినూత్న రీతిలో అవగహన

బంజారాహిల్స్, ఫిబ్రవరి 28: ప్రపంచంలోని ప్రతి జీవరాశికి ప్రాణం ఉంటుందని, అవన్నీ నొప్పిని అనుభవిస్తాయని, మాంసాహారం తినడం అంటే నోరులేని మూగజీవాలను హింసించడమే అని అన్నారు. పెటా ఇండియా ప్రతినిధులు శుక్రవారం బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కువద్ద వినూత్న రీతిలో అవగాహన నిర్వహించారు. గో వెగాన్ నినాదంతో పార్కు వద్ద పెటా ఇండియా ప్రతినిధులు చేపల వేషధారణతో వాటిలో కలిగే బాధను, భయాన్ని ప్రదర్శించారు. చేపలు కూడా మనిషిలాగే నొప్పిని అనుభవిస్తాయని, ఊపిరి ఆడకుండా చేసి వాటిని చంపి తినడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ జీవహింసకు తావులేని శాఖాహారులుగా మారాలని కోరుకుంటున్నామని పేర్కొన్నారు.

బీఓబీలో క్యాష్ బ్యాక్ ప్రోగ్రామ్ ప్రారంభం

సిటీబ్యూరో, ఫిబ్రవరి28 (నమస్తే తెలంగాణ): బ్యాంక్ ఆఫ్ బరోడా ఆర్బీఐ మార్గదర్శకంలో సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ(సీబీడీసీ)ప్రోగ్రామబిలిటీ ఫీచర్ ఆధారంగా మెర్చంట్ లాయల్టీ/ క్యాష్‌బ్యాక్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించినట్లు ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజయ్ వి ముదాలియర్ తెలిపారు. ఈ ప్రోగ్రామ్ ద్వారా చిన్న, మధ్య తరహా వ్యాపారులు తమ సొంత క్యాష్‌బ్యాక్ కార్యక్రమాలను బాబ్ మర్చంట్ యాప్ ద్వారా డిజైన్ చేసి అమలు చేసుకోవచ్చని ఆయన అన్నారు. ఏ ఇతర సాంకేతిక అవసరాలు లేకుండానే లాయల్టీ ప్రయోజనాలు కల్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఉజ్వల భవిష్యత్తుకు సైన్సే కీలకపాత్ర

జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి

సిటీబ్యూరో, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): ఉజ్వల భవిష్యత్తుకు సైన్సే కీలకపాత్ర అని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అన్నారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యానిమల్ బయో టెక్నాలజీలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జరిగిన కార్యక్రమానికి కమిషనర్ ముఖ్య అతిథిగా హాజరై 'ప్రజారోగ్యం, పట్టణ పాలనలో దాని భూమిక' అంశంపై ప్రసంగించారు. నేషనల్ సైన్స్ డేలో పాల్గొనడం ఎంతో గౌరవంగా భావిస్తున్నానని, సర్ సీవీ రామన్ స్ఫూర్తులను సర్మించుకున్నారు. నగరాలు వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో ప్రజారోగ్యం, జంతువుల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ అంతర్గతంగా అనుసందానమై ఉన్నాయని చెప్పారు. దీనిని గుర్తించి చర్యలు తీసుకోవడం అనివార్యమని వివరించారు. భారత్‌లో ప్రతి ఏడాది 18వేల నుంచి 20వేల మరణాలు సంభవిస్తున్నాయని, వీరిలో ఎక్కువ మంది 15 ఏండ్లలోపు పిల్లలేనని కమిషనర్ అన్నారు. జీహెచ్ఎంసీ రేబిస్ నియంత్రణ చర్యలు తీసుకుంటుందని, సామూహిక టీకా కార్యక్రమాలు, బాధ్యతాయుతమైన పెంపుడు జంతువుల యాజమాన్యం, కుక్కకాటు నివారణకు అవగాహన కల్పించడం చాలా కీలకమని పేర్కొన్నారు. సురక్షితమైన ఆహార ఉత్పత్తి, నిల్వ, పంపిణీని నిర్ధారించడంతో కఠిన నియంత్రణలు అమలు చేస్తుందన్నారు. దోమల ద్వారా వ్యాప్తి చెందే డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా వంటి వ్యాధులు పట్టణ ప్రజలపై ప్రభావం చూపుతున్నాయని చెప్పారు. ఇంటిగ్రేటెడ్ వెక్టర్ కంట్రోల్ ప్రోగ్రామ్ రియల్ టైం, డిసీస్ ట్రాకింగ్ చేపట్టిందన్నారు. వదరలు, నిల్వ నీరు, మూలిక సదుపాయాల నష్టాన్ని తగ్గించేందుకు జీహెచ్ఎంసీ వరద నీటి మాస్టర్ ప్లాన్ రూపొందించిందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఐఏబీ డైరెక్టర్ డాక్టర్ జి.తారుశర్మ, పీహెచ్‌డీ విద్యార్థులు, పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

భయం వీడి.. పట్టుదలతో చదవాలి

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

షేక్‌పేట్ గురుకుల విద్యార్థులతో కలిసి నిద్రిస్తున్న హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సిటీబ్యూరో, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): విద్యార్థులు కష్టపడి చదవడం వల్ల మంచి ఫలితాలు సాధించవచ్చని, ఉన్నత చదువులతోనే పై స్థాయి ఉద్యోగాలు సాధించే అవకాశం ఉంటుందని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. షేక్‌పేట్ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల, జూనియర్ కళాశాలలో శుక్రవారం ఆయన రాత్రి బస చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులతో మాట్లాడుతూ పరీక్షలు అంటే భయం వీడి పట్టుదలతో చదవి మెరుగైన ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలన్నారు. గత ఏడాది లాగా ఎస్ఎస్సీ ఇంటర్మీడియట్ పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత ఉండాలన్నారు. విద్యార్థుల స్టడీ అవర్స్ తీరును గమనించి ఉపాధ్యాయులను అభినందించారు. నిద్రకు ఉపక్రమించే సమయంలో విద్యార్థులతో మాట్లాడుతూ భయం వీడాలని, పరీక్షల సమయంలో మానసిక ఆందోళన పడవద్దని, ప్రశాంత వాతావరణంలో రాయాలని సూచించారు. తల్లిదండ్రుల కలలు సాకారం చేయాలని ఆకాంక్షించారు.

పద్మశాలీలకు తగిన ప్రాధాన్యమివ్వడం లేదు

ఖైరతాబాద్, ఫిబ్రవరి 28: పద్మశాలీలకు కాంగ్రెస్ ప్రభుత్వం తగిన ప్రాధాన్యత కల్పించాలని వక్తలు కోరారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో తెలంగాణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం అధ్యక్షులు దాసు సురేశ్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులుతో కలిసి మాట్లాడుతూ రాష్ట్రంలో ఇతర రాష్ట్రాలు, దేశాలకు వలస వెళ్లిన వారిలో పద్మశాలీలే అధిక సంఖ్యలో ఉంటారన్నారు. జనాభా ప్రాతిపదికన సంక్షేమ ఫలాలు నోచుకోలేదని, ఫలితంగా పొట్ట చేత పట్టుకొని వలసలు వెళ్తున్నారన్నారు. ప్రభుత్వం విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో సరైన ప్రాధాన్యతనివ్వడం లేదన్నారు. కులగణన అనంతరం రాజ్యాధికారం కోసం పద్మశాలీలు ఉద్యమించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో జరిగిన అనేక పోరాటాల్లో పద్మశాలీలు అగ్రభాగాన నిలిచినా సంక్షేమంలో మాత్రం వారిని వెనుకబాటుకు గురిచేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షులు బూర మల్లేశం, ప్రధాన కార్యదర్శి వేముల బాలరాజు, అప్పం శ్రీనివాస్, గుజ్జ రాజేశ్వరి, వేముల వెంకన్న, మత్స సుధాకర్ రావు, కిశోర్, సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు సజావుగా నిర్వహించాలి

జిల్లా రెవెన్యూ అధికారి ఇ.వెంకటాచారి

244 కేంద్రాల్లో పరీక్ష రాయనున్న 1,79,218 మంది విద్యార్థులు

అధికారులకు సూచనలిస్తున్న డీఆర్వో వెంకటాచారి

సిటీ బ్యూరో, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): ఇంటర్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఈ వెంకటాచారి అన్నారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లోని సరోజిని నాయుడు వనిత మహా విద్యాలయంలోని శంకర్ జీ ఆడిటోరియంలో శుక్రవారం చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ ఆఫీసర్లతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో ఇంటర్ వార్షిక పరీక్షలు మార్చి 5 నుంచి 25వ తేదీ వరకు 244 కేంద్రాల్లో నిర్వహిస్తున్నామని చెప్పారు. వీరిలో ప్రథమ సంవత్సర విద్యార్థులు 85,753 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 93,465 మంది, మొత్తం 1,79,218 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలు తాగునీరు, టాయిలెట్స్, మెరుగైన శానిటేషన్ సరైన ఫర్నిచర్, వైద్య సౌకర్యాలు ఉండేలా చూడాలని సూచించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే పరీక్షలకు హైదరాబాద్ లో ట్రాఫిక్ దృష్ట్యా విద్యార్థులు ఉదయం 8 గంటలకే కేంద్రాలకు చేరుకోవాలని తెలిపారు. సంబంధిత అధికారులు కేటాయించిన విధులను అత్యంత జాగ్రత్తతో అప్రమత్తంగా నిర్వహించాలని ఆదేశించారు. అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఉంటాయని, ప్రశ్నాపత్రాల కవరు సీల్ తీయటం, జవాబు పత్రాలను కవరులో ఉంచి సీల్ వేయడం సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరుగుతుందని స్పష్టం చేశారు. చీఫ్ సూపరిండెంట్ కి తప్ప మిగతా వారికి మొబైల్ ఫోన్ అనుమతి లేదన్నారు. విద్యార్థులకు ఏవైనా సందేహాలు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 040 29700934 ను సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి డీ ఒడ్డెన్న, చీఫ్‌సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంట్మెంటల్ ఆఫీసర్స్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ లే కుటుంబ నిర్మాణ కర్తలు కావాలి

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 28: మహిళలే కుటుంబ నిర్మాణ కర్తలు కావాలని, వారిని విద్య, వాణిజ్యం, పారిశ్రామిక రంగాల ద్వారా శక్తివంతం చేయాల్సిన అవసరం ఉందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ (సీఓడబ్ల్యూఈ) ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటుచేసిన ఉమెన్ ఇంటర్నేషనల్ సమ్మిట్ ఆన్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ (డబ్ల్యూఐఎస్ఈ), బీ2బీ ఎక్స్‌పో 2025ను గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్‌లో ముఖ్యఅతిథిగా హాజరై ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇన్నోవేషన్, ఈ సమ్మిట్ సస్టైనబిలిటీ, అంతర్జాతీయ సహకార భావనను ప్రతిబింబిస్తుందన్నారు. మహిళా వ్యాపారవేత్తలకు టెక్నాలజీ ద్వారా సాధికారత కల్పించేందుకు చర్చిస్తున్న సందర్భంలో వ్యాపార భవిష్యత్తు డిజిటల్ తో ప్రపంచవ్యాప్తంగా అనుసంధానం అయ్యిందన్నారు. టెక్నాలజీ ద్వారా లింగ అసమానతలను తగ్గించుకోవాలన్నారు. కొత్త మార్కెట్లు తెరవాలన్నారు. వ్యాపారాలు విస్తృత పరచుకోవాలన్నారు. గ్రామీణ మహిళలు ఇప్పుడు జాగృతమయ్యారని, సమాజాన్ని తీర్చిదిద్దేది వారేనని పేర్కొన్నారు. వికసిత మహిళలు లేకుండా వికసిత్ భారత్ ఊహించలేమని చెప్పారు. రాష్ట్ర మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ మహిళా ఔత్సాహిక వ్యాపారవేత్తలు అభివృద్ధి చెంది, రాష్ట్ర ఆర్థిక పురోగతిని నడిపించే సమగ్ర, సాధికారత కలిగిన వాతావరణాన్ని సృష్టించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇందుకు 'ఇందిరా మహిళా శక్తి' కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రభుత్వ ఉన్నతాధికారులు, పలు సంస్థల సీఈవోలు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

వర్గీకరణలో మాలలకు తీవ్ర అన్యాయం

సమావేశంలో మాట్లాడుతున్న మాల సంఘాల జేఏసీ అధ్యక్షుడు మాందాల భాస్కర్, డాక్టర్ నాగం కుమారస్వామి, మామిడి నారాయణ, శంకర్ తదితరులు

ఖైరతాబాద్, ఫిబ్రవరి 28: షమీమ్ అక్తర్ కమిషన్ విధానం వల్ల మాలలు, అనుబంధ కులాలకు వర్గీకరణలో రిజర్వేషన్ల ఫలాల్లో తీవ్ర అన్యాయం జరిగిందని వక్తలు అన్నారు. మాల యూత్ ఫెడరేషన్, మాల మేధావుల ఫోరం, మాల విద్యావంతుల వేదిక, ఆల్ మాల స్టూడెంట్ అసోసియేషన్, మాల స్టూడెంట్ జేఏసీ సంయుక్తాధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాల సంఘాల జేఏసీ అధ్యక్షుడు మాందాల భాస్కర్ మాట్లాడుతూ సుప్రీం కోర్టు సూచనలను పాటించకుండానే షమీమ్ అక్తర్ కమిషన్ రిజర్వేషన్లను వర్గీకరించిందన్నారు. రాష్ట్రంలోని వివిధ ఎస్సీ కుల సంఘాలు, ఉద్యోగ, మేధావులు, విద్యావంతులు ఇచ్చిన నివేదికల ప్రకారం కమిషన్ వర్గీకరణ చేసిందన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించకుండా, అధ్యయనం చేయకుండా చేపట్టిందన్నారు. మాల, మాల అనుబంధ కులాలను మూడో గ్రూపులో పెట్టిందని, కానీ ఉషా మెహ్రా కమిషన్ మాదిగలే ఎక్కువ అభివృద్ధి ఫలాలు, ఉద్యోగాలను పొందడంలో ముందు వరుసలో ఉన్నారని చెప్పిందన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ మాలలను టార్గెట్ చేస్తూ ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. మూడో గ్రూపులో చేర్చడంలో కమిషన్ ఎలాంటి ప్రాతిపదికను తీసుకున్నదో చెప్పలేదన్నారు. రోస్టర్ విధానంలో తీవ్ర అన్యాయం జరిగిందని, తాజా అధ్యయనం చేసిన తర్వాతే వర్గీకరణ అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ నాగం కుమారస్వామి, మామిడి నారాయణ, రఘుపతి, డి.శంకర్, నర్సయ్య, సత్యనారాయణ, దాసరి నాగరాజు, భాను, సైదులు, అర్జున్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

అమీర్‌పేట్ ఫిబ్రవరి 28: కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా టెక్ మహీంద్ర స్మార్ట్ అకాడమీ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు సప్లై చైన్ మేనేజ్మెంట్, వేర్ హౌస్ మేనేజ్మెంట్ కోర్సుల్లో ఉచిత శిక్షణనిస్తూ ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ దీప్తి తెలిపారు. ప్రవేశానికి ఇంటర్మీడియట్, డిప్లొమా ఐటీఐ డిగ్రీ అర్హతగా తెలిపారు. అభ్యర్థుల వయసు 18 నుంచి 35లోపు ఉండాలన్నా రు. క్లాసులు మార్చిలో ప్రారంభమవుతాయని, పూర్తిచేసిన అభ్యర్థులకు ఉపాధి అవకాశాలు విస్తృతంగా ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు ఎర్రగడ్డ రైతు బజార్ ఎదురుగా ఉన్న (మెట్రో పిల్లర్ నంబర్ A980) సనత్‌నగర్ సెయింట్ థెరిసా చర్చి కాంపౌండ్ ఆవరణలో ఉన్న కార్యాలయంలో లేదా 73373 32606 లో సంప్రదించాలన్నారు.

ఎల్ఆర్ఎస్ పరిష్కారానికి హెల్ప్ డెస్క్‌లు

నెలాఖరు వరకు సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్ఎంసీ సూచన

సిటీబ్యూరో, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): లేఅవుట్ క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్) పథకంలో భాగంగా ప్లాట్ల క్రమబద్ధీకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేందుకు జీహెచ్ఎంసీ చర్యలు చేపట్టింది. ఈ నెలాఖరులోగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులన్నింటికీ పరిష్కారం చూపాలని నిర్ణయించిన అధికారులు, జోన్ల వారీగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికిగానూ హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసింది. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారుల సందేహాల నివృత్తికి ఈ హెల్ప్ డెస్క్‌లు దోహదపడతాయని అధికారులు పేర్కొన్నారు. కాగా జీహెచ్ఎంసీ పరిధిలో 107865 దరఖాస్తులను స్వీకరించారు. ఎల్బీనగర్‌లో 40383, చార్మినార్ 15292, ఖైరతాబాద్ 5773, శేరిలింగంపల్లి 18721, కూకట్‌పల్లి 22901, సికింద్రాబాద్ 4795ల దరఖాస్తులను స్వీకరించారు. ఇందులో దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను పూర్తి చేసి, 25 శాతం రిబేట్‌ను సద్వినియోగం చేసుకుని సంబంధిత ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలని అధికారులు సూచించారు.

వాటర్ స్పోర్ట్స్ అకాడమీలో ప్రవేశాలకు ఆహ్వానం

సిటీ బ్యూరో, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): బోయినపల్లిలోని ప్రభుత్వ గిరిజన వాటర్ స్పోర్ట్స్ అకాడమీలో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ బాలబాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఆర్.కోటాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు మార్చి 10 లోపు దరఖాస్తులు అందజేయాలని సూచించారు. 5వ తరగతిలో (40), 6వ తరగతి (9), 7వ తరగతి (10), 8వ తరగతి (7) సీట్లు ఖాళీగా ఉన్నట్లు వెల్లడించారు. ఏదైనా గుర్తింపు పొందిన ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం 4, 5, 6, 7వ తరగతి చదువుతూ కుటుంబ వార్షిక ఆదాయం రూ.2 లక్షలలోపు ఉన్న వారు అర్హులని చెప్పారు. దరఖాస్తులను సంబంధిత ప్రధానోపాధ్యాయుడి సంతకంతో లక్డీకాపూల్‌లోని కలెక్టరేట్ ప్రాంగణం, సిల్వర్ జూబ్లీ భవనంలోని 4వ అంతస్తులో గల జిల్లా గిరిజన అభివృద్ధి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. ఎంపిక పరీక్ష 22న బోయిన పల్లిలోని వాటర్ స్పోర్ట్స్